క్లుప్తంగా

పూర్తి వేతనం చెల్లించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌పీహెచ్‌పీ)లో థర్డ్ పార్టీ శాంప్లింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు కాంట్రాక్టర్ పూర్తి జీతం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బీఎంఎస్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక కోరారు. సోమవారం డీవైజీఎం వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశాక ఆయన మాట్లాడారు. నాయకులు ఇనుపూరి నాగేశ్వరరావు, నిర్మల, కుమార్, ఆనంద్, పూర్ణ, అస్లాం, జస్వంత్, సాయిరాం, రమేష్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పునుకుల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: హనుమకొండ జిల్లా పరకాలలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్న మండలంలోని పునుకుల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ఆరో తరగతి చదువుతున్న సింధు, సిరి, ఏలేశ్వరి, సింధుకా బంగారు పతకాలు కైవసం చేసుకున్నారని హెచ్‌ఎం ఉషారాణి తెలిపారు. విద్యార్థినులను సోమవారం ఎంఈఓ శ్రీరాంమూర్తి, హెచ్‌ఎం, కరాటే కోచ్ మరియమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

చట్టాలపై అవగాహన

పాల్వంచరూరల్: మహిళా వారోత్సవాల సందర్భంగా మండలంలోని జగన్నాధపురం హైస్కూల్లో సోమవారం విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ప్రకాశ్‌రావు, సీడీపీఓ కనకదుర్గ మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా అధిగమించాలో వివరించారు. యువమణి, శైలజ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వసంతరాణి, అనసూర్య, రత్నకుమారి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

జూలూరుపాడు: డెంటిస్ట్ డే సందర్భంగా గుండెపుడి శ్రీఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కొత్తగూడెం ఆరోగ్యం దంత వైద్యశాల డాక్టర్ షర్మిల ఆధ్వర్యాన సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా హాజరైన వారికి షర్మిల వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో దుద్దుకూరి సుమంత్, వైస్‌ఎంపీపీ గాదె నిర్మల, సర్పంచ్ బానోత్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో..

కొత్తగూడెంరూరల్: రేగళ్ల గ్రామ పంచాయతీ సూర్య, హర్యతండాల్లో సోమవారం శేషమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ కేసాని మారుతిబాబు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఉద్యోగులకు ఆటల పోటీలు

చుంచుపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా సందర్భంగా సోమవారం ఆర్టీసీలోని మహిళా ఉద్యోగులకు కొత్తగూడెం డిపోలో ఆటలపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన పలువురికి డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. రాణి, విజయలక్ష్మి, సునీత, ఇసనపల్లి శామ్యూల్ పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలంటూ నిరసన

పాల్వంచరూరల్: తెలంగాణ సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లటి దుస్తులను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రషీద్ మాట్లాడారు. ఉపాధి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌కె.గౌస్‌పాషా, రవికుమార్, సద్దాం, పెద్దిబాబు, బి.మోహన్, ముత్యం, రాము, జయరాజ్, ఐలయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

జీఎంకు అభినందన

ఇల్లెందు: ఈ వార్షిక సంవత్సరంలో 27 రోజుల ముందుగా ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించి ఇతర ఏరియాల కంటే ముందు నిలిపిన ఇల్లెందు ఏరియా జీఎం ఎం.షాలేమురాజును గుర్తింపు సంఘం నాయకులు సోమవారం సన్మానించారు. ఎస్.రంగనాథ్, కళ్లం కోటిరెడ్డి, సంజీవరావు, వెంకటేశ్వర్లు, బొల్లెద్దుల ప్రభాకర్, బొలా కుమార్, అనిల్, యాదగిరి, జాఫర్, ఆశోక్, శ్రీనివాసరెడ్డి, రాజు, శ్రీకాంత్, రవి, మంగపతిరావు, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

ఇల్లెందు: కార్నర్ మీటింగ్‌లను విజయవంతం చేసిన కార్యకర్తలు, నాయకులు బూత్ స్వశక్తికరణ్ అభియాన్ సభలను కూడా విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు కోనేరు సత్యనారాయణ కోరారు. సోమవారం ఇల్లెందులోని పెన్షనర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

బస్తీ దవాఖానాలు రెడీ!

- మొదటి విడతగా మున్సిపాలిటీకి రెండేసి ఏర్పాటు
- ఇల్లెందు, కొత్తగూడెంలో రెండు, పాల్వంచలో ఒకటి
- అందుబాటులోకి రానున్న వైద్యం



ఇల్లెందు కొత్తకాలనీలో ప్రారంభానికి సిద్ధమైన బస్తీ దవాఖానా

ఇల్లెందు: మున్సిపాలిటీ కేంద్రాల్లో చిన్నచిన్న గాయాలైనా.. ఏ చిన్న వైద్యానికైనా ప్రధానాస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం అలాంటి అవసరం లేకుండా ప్రభుత్వం వార్డుల్లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తోంది. ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచలో మొదటి, రెండు విడతల్లో ఐదు దవాఖానాలు మంజూరు చేశారు. ఇల్లెందు, కొత్తగూడెంనకు రెండేసి, పాల్వంచలో ఒకటి మంజూరు చేయగా.. పాల్వంచ, కొత్తగూడెంలో రామవరం, కరకవాగులో దవాఖానా ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే, ఇల్లెందు కొత్తకాలనీలో ఒకటి, జేబీఎస్ పాఠశాలలో మరొకటి మంజూరు చేయగా, కొత్తకాలనీలోని హెల్త్ సబ్ సెంటర్‌ను బస్తీ దవాఖానాగా మార్చి పనులు చేపట్టారు. ఈ బస్తీ దవాఖానా ప్రారంభమైతే కొత్తకాలనీ, లేబర్‌కాలనీ, పట్టణంలోని 11, 12, 13, 14, 15 వార్డుల ప్రజలకు వైద్యం దరి చేరనుంది.

రెండో దవాఖానా పనులు కూడా..

ఇల్లెందులో ఇంకో బస్తీ దవాఖానా కోసం జేబీఎస్ పాఠశాల ఆవరణలో నిరుపయోగంగా ఉన్న భవిత భవనాన్ని కేటాయించారు. గోవింద్ సెంటర్‌లోని బాలికల పాఠశాలలో ఉన్న భవనాన్ని కూడా గుర్తించినా జేబీఎస్ పాఠశాలలోని భవనాన్నే ఎంపిక చేశారు. ఇక్కడ పనులు నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు సన్నాహాలు జరుగుతుండగా.. కొత్త బస్టాండ్, ఎల్‌బీఎస్‌నగర్, 21 ఏరియా, 24 ఏరియా, స్ట్రట్‌ఫిట్ బస్తీ, సత్యనారాయణపురం, కోర్టు ఏరియా, స్టేషన్ బస్తీ ఏరియా వాసులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

రూ.10 లక్షల చొప్పున నిధులు

ఒక్కో బస్తీ దవాఖానాకు ప్రభుత్వం రూ.10 లక్షల నిధులు కేటాయిస్తోంది. ఇందులో ఒక డాక్టర్, స్టాఫ్ నర్సు, నర్సు అందుబాటులో ఉంటారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండి పరీక్షలు, రోగనిర్ధారణ చేయడంతో పాటు మందులు అందించనున్నారు. ప్రాథమిక రోగ నిర్ధారణ పరీక్షలు, గర్భిణులు, బాలింతలకు పరీక్షలు, టీకాలు వేయడం, కుటుంబ నియంత్రణ కౌన్సెలింగ్, రక్తహీనత, షుగర్, బీపీ పరీక్షలే కాకుండా ప్రతీ బుధ, శనివారాల్లో చిన్నారులకు టీకాలు వేయనుండటంతో ప్రజలు బస్తీలకు దూరంగా ఉన్న ఏరియా ఆస్పత్రికి వెళ్లే బాధ తప్పనుంది.



బస్తీ దవాఖానా ఏర్పాటుకు గుర్తించిన జేబీఎస్‌లోని భవిత భవనం

రెండింటిలో ఒకటి సిద్ధం



ఇల్లెందుకు రెండు రెండు బస్తీ దవాఖానాలు మంజూరు చేయగా, కొత్త కాలనీలో పనులు పూర్తికావొచ్చాయి. ఇక జేబీఎస్‌లో నిరుపయోగంగా ఉన్న భవిత భవనాన్ని కూడా ఇంకో దవాఖానా ఏర్పాటుకు గుర్తించాం. త్వరలోనే ఇక్కడ కూడా పనులు ప్రారంభించి నెలాఖరు నాటికి అందుబాటులోకి తీసుకొస్తాం.

–అంకుషావలీ, కమిషనర్, ఇల్లెందు మున్సిపాలిటీ

త్వరగా ప్రారంభించాలి..



పట్టణంలోని 24 వార్డుల వారు ఉన్న ఒక్క హాస్పిటల్‌కు రావటం వల్ల రద్దీ పెరుగుతోంది. ఎక్కడికక్కడ బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తే ఆస్పత్రి ఉద్యోగులపై భారం తగ్గుతుంది. మున్సిపాలిటీకి మంజూరైన రెండు బస్తీ దవాఖానాలను త్వరగా అందుబాటులోకి తీసుకొస్తే ప్రజలకు మేలు జరుగుతుంది.

–ఊర్ల లింగరాజు, 7వ వార్డు, ఇల్లెందు

ఇఫ్టూ మహాసభను జయప్రదం చేయండి

టేకులపల్లి: పాల్వంచలో ఈ నెల 12న జరగనున్న ఇఫ్టూ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోడేటి నాగేశ్వరరావు, కె.సారంగపాణి పిలుపునిచ్చారు. టేకులపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మహాసభల వాల్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల సంక్షేమానికి అనేక హక్కులు సాధించిన ఘనత ఐఎఫ్‌టీయూదేనని తెలిపారు. కాగా, ప్రస్తుత పాలకులు అవలంబిస్తున్న విధానాలపై పోరాడేందుకు ఈ మహాసభల్లో కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. నాయకులు మోత్కూరి మల్లికార్జున్‌రావు, రాయండ్ల కోటిలింగం, శివయ్య, షఫీ, రవిబాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న శ్రీనివాసరావు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి పాల్వంచకు చెందిన నేరెళ్ల శ్రీనివాసరావు – పద్మావతి దంపతులు రూ.32 వేలు విరాళంగా అందజేశారు. ఈ విషయాన్ని ఈఓ ఎస్.రజనీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గోటి తలంబ్రాలతో భక్తుల పాదయాత్ర



గోటి తలంబ్రాలతో భద్రాచలం బయలుదేరిన రామభక్తులు

జూలూరుపాడు/సుజాతనగర్/పాల్వంచరూరల్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో గోటి తలంబ్రాలు సమర్పించేందుకు సోమవారం ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యాన భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. మండలంలోని వివిధ గ్రామాల భక్తులు నాలుగేళ్లుగా జూలూరుపాడు శ్రీసీతారామాలయంలో గోటి తలంబ్రాలు వలిచి భద్రాచలం ఆలయంలో సమర్పిస్తున్నారు. ఈసారి కూడా ధర్మ జాగరణ సమితి అధ్యక్షుడు సాయిన్ని కృష్ణార్జున్‌రావు ఆధ్వర్యాన పూజలు చేసిన అనంతరం సోమవారం తెల్లవారుజామున భద్రాచలానికి పాదయాత్ర మొదలుపెట్టారు. ఈ క్రమంలో కొమ్ముగూడెం శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేశ్, శాంతికుమారి తదితరులు భక్తులకు అల్పాహారం ఏర్పాటుచేశారు. కాగా, సుజాతనగర్ నుంచి భద్రాచలానికి గోటి తలంబ్రాలతో భక్తులు చింతలపూడి సుజాత, మిరియాల శ్రీలత, వనపర్తి నాగలక్ష్మి, ఉడుమల సౌజన్య, బత్తుల వెంకటలక్ష్మి, పద్మావతి, వి.శ్రీదేవి, టి.కవిత, పి.ప్రమీల, ఎన్.సాయిదుర్గ, యల్లంకి లక్ష్మి తదితరులు పాదయాత్ర బయలుదేరారు. వీరికి పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి వద్ద ఆర్యవైశ్య మహాసభ, వాసవీక్లబ్ బాధ్యులు భోజనం సమకూర్చారు. చలువాది ప్రకాశ్, తాటికొండ సురేశ్, బచ్చు శ్రీనివాస్, మాల రాజేశ్, దోగిపర్తి సతీశ్, ఇందుకూరి సాయి, దారా శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ప్రజల ఆకాంక్షను పట్టించుకోని ప్రభుత్వం'



పాదయాత్రలో న్యూడెమోక్రసీ కార్యకర్తలు

ఇల్లెందు/ఇల్లెందురూరల్: కొమరారం, బోడు కేంద్రాలుగా నూతన మండలాలతో పాటు ఇల్లెందు రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలనే ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని న్యూడెమోక్రసీ నాయకులు ఆరోపించారు. మండలాలు, డివిజన్ సాధన కోసం న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన చేపట్టిన పాదయాత్ర సోమవారం మూడోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా మండలంలోని పోచారంలో వాంకుడోత్ మోతీలాల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బోయితండా సర్పంచ్ బానోత్ సంతు మాట్లాడుతూ గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న కొమరారం, బోడు ప్రాంతాలను నూతన మండలాలుగా ప్రకటించాలనే ప్రజల విజ్ఞప్తిని రాజకీయ ప్రయోజనాల కోసం పక్కన పెట్టడం సరికాదన్నారు. అనంతరం బోయితండా వరకు పాదయాత్ర కొనసాగించారు. సర్పంచ్‌లు వాంకుడోత్ శ్రీను, వాంకుడోత్ సరోజిని, ఎంపీటీసీ ఈసాల పాపమ్మ, నాయకులు మంగ్యా, మంగీలాల్, మూడు మాలు, జోగా కృష్ణ, రాంబాబు, శ్రీను, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, నూతన మండలాలు, డివిజన్ కోసం ఇల్లెందు పాత బస్టాండ్ సెంటర్‌లో సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. నాయకులు గుమ్మడి నర్సయ్య, ఎస్‌ఏ నబీ, పులి సైదులు, డి.శంకర్, రమేశ్‌బాబు కౌన్సిలర్ కె.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలి



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కేఎం తార

టేకులపల్లి: సమాజంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కె.ఎం.తార, హెల్ప్‌లైన్ ప్రతినిధి సారిక పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్, హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసీడీపీఓ అరుణకుమారి, అనురాధ, సక్కుబాయి, లక్ష్మి, యశోద, నిర్మల, సంతు, టీచర్లు పద్మ, అశ్విని పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

ఇల్లెందు: మహిళలు ధైర్యంగా బయట తిరిగినప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని.. మహిళలు స్వేచ్ఛగా తిరిగేలా స్వేచ్ఛ, రక్షణ కల్పించాల్సిన బాధ్యత పాలకులదేనని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వై.పద్మ అన్నారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యాన ఇల్లెందులో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సులో ఆమె మాట్లాడారు. గుమ్మడి సమ్మయ్య, జి.హరిలాల్, పూర్ణచందర్‌రావు, భాగ్యారావు, ఇమ్మాన్యుయేల్, స్వామిదాసు, పూర్ణిమ, ఈశ్వర్, కిషన్, రమేశ్, అశోక్, రాంజీ, కవిత, శిరీష, విజయ, పద్మ పాల్గొన్నారు.

జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో..

కొత్తగూడెంఅర్బన్: మహిళలు లేనిదే మానవ మనుగడ లేదని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం రామవరంలోని హుదా ఇస్లామిక్ సెంటర్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో పలువురు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మునిగడప పద్మ, మక్బూల్, సీత, పర్వీన్, ఫాతిమా, రూబీన, లక్ష్మి, ఆదిలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

కేటీపీఎస్ సీఈకి సన్మానం



సీఈ ప్రభాకర్‌రావును సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ: కేటీపీఎస్ 5, 6 దశల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ల గైర్హాజరు కాలాన్ని రెగ్యులరైజేషన్ చేయడం పట్ల టీఆర్‌వీకేఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం సీఈ ఎం.ప్రభాకర్‌రావును కలిసి సన్మానించారు. ఎస్‌ఈ ఏడీఎం సత్యనారాయణ, డీజీఎం వీవీఎస్ మూర్తి, ఏఎస్ పద్మజ, ఆర్టిజన్ సెక్షన్ ఏడీఈ నరసింహారావును సైతం సన్మానించారు. కె.రవికుమార్, ఎం.రమేశ్, శేషంరాజు, వెంకట్‌రావు, పున్నం రాజు, సతీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాధాకృష్ణులకు బోనాల చెల్లింపు

ఇల్లెందురూరల్: రాధాకృష్ణుల కల్యాణాన్ని పురస్కరించుకుని మండలంలోని కొమరారం గ్రామంలో ప్రజలు దేవతామూర్తులకు సోమవారం బోనాలు చెల్లించారు. ఆలయ ప్రధాన పూజారి కోరం కోటమ్మ బోనాలకు ఎదురేగి స్వాగతించగా, రాధాకృష్ణులకు బోనాలు చెల్లించాక కల్యాణ వేడుకలు ప్రారంభించారు. తొలుత గ్రామంలో పలు కటుంబాలు సిద్ధం చేసిన తలంబ్రాల బియ్యాన్ని ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు.

దళితులకు భూమి అప్పగించాలి

జూలూరుపాడు: ఇనామ్ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవడంతో పాటు దళితులకు భూమి తిరిగి అప్పగించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్ డిమాండ్ చేశారు. భూమి అప్పగించాలనే డిమాండ్‌తో వెంగన్నపాలెంనకు చెందిన దళితులు జూలూరుపాడులో చేపట్టిన నిరాహారదీక్ష సోమవారం 12వ రోజు కొనసాగింది. ఈ శిబిరాన్ని ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ సందర్శించి మాట్లాడారు. గుండెపుడి రెవెన్యూ పరిధిలో 1.09 ఎకరాల భూమిని వెంగన్నపాలెంనకు చెందిన దళితుడు తంబర్ల ముత్తయ్యకు నిజాం సర్కార్ ఇస్తే అడ్డదారిలో పట్టా పొందిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్పీఐ నాయకులు నకిరికంటి సంజీవరావు, సరిగోమల స్నేహలత, మిట్టపల్లి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాపై దాడి

కొత్తగూడెంఅర్బన్: హిజ్రాపై అత్యాచారయత్నం, దాడి చేసిన వారిపై త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కూలీలైన్ ఏరియాకు చెందిన నేరచరిత్ర ఉన్న కొమ్ముగట్టు ప్రవీణ్, మిర్యాల శ్రీకాంత్ కలిసి గాజులరాజం బస్తీ ఏరియాలో ఓ ఇంట్లో కిరాయికి ఉంటున్న హిజ్రా రొడ్డ లాలసా ఇంటికి ఆదివారం అర్ధరాత్రి వెళ్లి అత్యాచారయత్నం చేశారు. ఆమె అడ్డుకోగా దాడి చేశారు. దీంతో ఆమె గాయపడింది. చుట్టు పక్కలవారు రావడంతో ప్రవీణ్, శ్రీకాంత్ అక్కడి నుంచి పరారయ్యారు. సోమవారం తోటి హిజ్రాలు త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా సర్వజన ఆస్పత్రిలో చోరీ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని జిల్లా సర్వజన ఆస్పత్రిలో కంప్యూటర్లు చోరీకి గురయ్యాయి. సోమవారం గమనించిన ఆస్పత్రి సిబ్బంది.. అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రి అధికారులు త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ, కేసు నమోదు కాలేదు. చోరీ అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): చుంచుపల్లి మండలం రామాంజనేయ కాలనీ పరిధిలోని సర్వే నంబరు 137/12లో మూడేళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న 350 కుటుంబాల ఆదివాసీగూడెం కొమరంభీంకాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణదొర డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పూనెం పద్ద, కోరెం కాంతమ్మ, మేకల కృష్ణ, బి.వెంకన్న, కుంజ రవి, మోహన్, చీమల శాంత, విజయ, శ్రీను పాల్గొన్నారు.

వార్డుల్లో ముగిసిన ఎమ్మెల్యే పాదయాత్రలు



స్టేషన్‌బస్తీలో డ్రెయినేజీను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ తదితరులు

ఇల్లెందు: పది రోజులుగా మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో సమస్యలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే హరిప్రియ చేపట్టిన పాదయాత్రలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా చివరి రోజు 21, 24 వార్డుల్లో కౌన్సిలర్లు కొండపల్లి, వి.తారతో కలిసి ఎమ్మెల్యే పర్యటించగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు, వీధిలైట్లు, తాగునీటి సమస్యలను స్థానికులు వివరించారు. లేక్ వ్యూపార్క్, చెరువు కట్ట, బతుకమ్మ ఘాట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వార్డుల్లో అభివృద్ధి పనులకు రూ.50 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తుండగా పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాదయాత్రలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీ పాషా, కమిషనర్ అంకుషావలీ, డీఈ రామకృష్ణ, ఏఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న ఆకాంక్షించారు. మండలంలోని తిలక్‌నగర్ గ్రామపంచాయతీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పంచాయతీ పరిధిలోని మహిళా ఉద్యోగులను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి యువతి చదువుపై దృష్టి సారించి ఉన్నతంగా ఎదగాలని, తద్వారా జీవితంలో స్థిరపడి కుటంబ పోషణలో తన వంతు భాగస్వామికావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిలక్‌నగర్, విజయలక్ష్మినగర్ సర్పంచ్‌లు ధనసరి స్రవంతి, పూనెం కవిత, రత్నకుమారి, విజయకుమారి, కొమరమ్మ, పద్మ, ఉమాబాయి, వెంకటమ్మ, అంజలిమేరి పాల్గొన్నారు.

తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): తునికాకు యాభై ఆకుల కట్టకు రూ.5 చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి మాచర్ల సత్యం డిమాండ్ చేశారు. లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించాక తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సత్యం మాట్లాడుతూ తునికాకు సేకరణలో అస్వస్థతకు గురయ్యే వారికి, మృతి చెందే వారికి పరిహారం చెల్లించడంతో పాటు పెండింగ్ బోనస్ వెంటనే విడుదల చేయాలన్నారు. నాయకులు పెద్దబోయిన సతీశ్, ఆజాద్, బానోత్ ధర్మా, బాడిష పాపారావు, గోపి నర్సయ్య, మంగీలాల్, నర్సింహారావు, నరేశ్ పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం

శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి పెళ్లికి తరలివచ్చిన భక్తులు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వనమా

పాల్వంచ: పట్టణ పరిధిలోని గుడిపాడులో కాకతీయ రాజుల కాలంనాటి పురాతన శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత మోక్ష వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. విష్వక్సేన, ఆరాధన, వాసుదేవ పుణ్యావాచనం, రక్షాబంధనం, కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఈఓ సులోచన, ఆలయ పునఃనిర్మాణ దాత నల్లా సురేశ్ రెడ్డి వేర్వేరుగా పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా బైరీ లక్ష్మి కోలాట బృందం నృత్యాలు అలరించాయి. ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అర్చకులు గొడవర్తి సంపత్ కుమార్, నగేశ్ శర్మ, ఫణి ప్రసాద్, రాధాకృష్ణ, రాధాకృష్ణ చారి, వాడే చంటి బాబు తదితరులు పూజాది కార్యక్రమాలు జరిపారు. ఈ కల్యాణ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ధనసరి సూర్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్, ఆలయ నిర్వాహకుడు ప్రశాంత్, పెద్దమ్మగుడి మాజీ చైర్మన్ మహిపతి రామలింగం, వైఎస్సార్ టీపీ నాయకులు సోయం వీరభద్రం, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజిబాబు, రమాదేవి పాల్గొన్నారు.

మహిళల మనుగడతోనే సమాజాభివృద్ధి

ఇల్లెందురూరల్: మహిళల మనుగడతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని సుభాష్‌నగర్ సర్పంచ్ వల్లాల మంగమ్మ అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'సమాజంలో స్త్రీ స్థానం, పరిణామాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు స్వశక్తితోనే తమ ఆర్థిక అవసరాలు తీర్చుకోగలగాలన్నారు.